బడి సమస్యల ఒడి

బండరాళ్లతో దర్శనమిస్తున్న కంకణాల పల్లి పాఠశాల

- అరకొర వసతుల మధ్య ప్రాథమిక విద్య
- తాగేందుకు నీళ్లు రావు.. వంట వండేందుకు షెడ్ లేదు..
- కంకణాల పల్లిలో ఎంపీపీఎస్ దుస్థితి ఇదీ

బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ అనేక సమస్యలు తిష్టవేసి దర్శనమిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులను విడుదల చేసి పాఠశాలలను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని ఓ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి చూస్తే.. ప్రభుత్వం, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో కనిపిస్తున్నది. పాఠశాలకు నీటి సరఫరా చేయలేక పోతున్నారు. బోరు బావి లేకపోవడంతో గ్రామంలోని ఓ బోరుతో నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న వేసవిలో నీరు తాగేందుకు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కంకణాళపల్లిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పలు సమస్యలు తిష్టవేశాయి. ఈ పాఠశాలలో 26 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా ప్రైవేటు పాఠశాలకు వెళ్లాలంటే 5 నుంచి 10 కిలో మీటర్ల దూరం

అసంపూర్తిగా మరుగు దొడ్ల నిర్మాణం

వెళ్లాలి. స్థానికంగానే ప్రభుత్వ పాఠశాలలో చదవాలని తల్లిదండ్రులు వారి పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నీటి ట్యాంకు ఉంది... అయినా నీళ్లు రావు.. అసంపూర్తిగా మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిలోకి నీటి సౌకర్యం లేదు. మధ్యాహ్న భోజనం వండేందుకు కార్మికులు ఉన్నా... కిచెన్ షెడ్ లేదు. పిల్లలు ఆటలాడేందుకు గ్రౌండ్ సౌకర్యం లేదు. పాఠశాల ఆవరణలో రాళ్లు, రప్పలు ఉన్నాయి. ఇలాంటి అసౌకర్యాల మధ్య ప్రాథమిక విద్య కొనసాగుతున్నది. 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకంలో ఈ బడికి నిధులు మంజూరు చేసినా తాగునీటి సౌకర్యం కల్పించలేదు. కనీసం పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతో పశువులు పాఠశాల ఆవరణలోనే సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. విద్యార్థులకు మరుగు దొడ్లు ఎలా ఉన్నా, స్థానికంగా పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు మరుగు దొడ్లు వాడుకోవడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో నిధులు మంజూరు

అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, మరుగు దొడ్ల నిర్మాణం కోసం రెండేండ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చేయాల్సిన కాంట్రాక్టర్ సక్రమంగా చేయలేదు.

- చంద్రప్ప ఎంఈవో, కోట్‌పల్లి మండలం

పాఠశాలలో అసంపూర్తిగా నీటి ట్యాంకు

అసంపూర్తిగా కిచెన్ షెడ్

విద్యార్థులు ఇబ్బంది పడొద్దు

కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ మోతీలాల్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 25: రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) టీం ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నేషనల్ ప్రోగామ్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్ సూచించారు. దవాఖానలో కొనసాగుతున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ విద్యార్థులకు కంటి పరీక్షలు చేసిన అనంతరం అద్దాలు అవసరమైన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా కంటి పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు తప్పకుండా వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు విజయలక్ష్మి, సుజాల, శ్రీకాంత్, ఆప్తాల్మిక్ డాక్టర్ పద్మలత, ఆప్తాల్మిక్ అధికారులు చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, రమేశ్, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో ఒడిశా రైతులు

తిర్మలాపూర్‌లో రైతులు సాగు చేసిన కుసుమ పంటను పరిశీలిస్తున్న ఒడిశా రైతులు

షాబాద్, ఫిబ్రవరి 25: రైతులు సాగు చేస్తున్న కుసుమ పంటను ఒడిశా రైతులు సందర్శించారు. భారతీయ నూనె గింజల సంస్థ సహాయంతో షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు సాగు చేస్తున్న కుసుమ పంటను మంగళవారం ఒడిశా రైతులు సందర్శించారు. ఒడిశాలో నూనెగింజల సాగు మెరుగపరచడానికి ఆధునిక విధానాలపై రైతు శిక్షణ అనే అంశంపై ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా భారతీయ నూనెగింజల సంస్థ రాజేంద్రనగర్‌కు వచ్చామని తెలిపారు. అందులో భాగంగా మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామాన్ని సందర్శించి సాగు పద్ధతులు, సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం చేస్తున్న కార్యక్రమాల అమలును తెలుసుకొన్నామన్నారు. అలాగే గ్రామంలో సాగు చేస్తున్న బ్రకోలీ, క్యారెట్ తదితర కూరగాయ పంటల సాగుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్, టెక్నీషియన్ నందీశ్వర్, ప్రేమనంద్ దాల్, బికున్‌నాయక్, గ్రామ రైతులు అనంతరెడ్డి, మాధవరెడ్డి, సాయిరెడ్డి, అంజయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలానికి రెండు ప్రత్యేక బస్సులు

పరిగి, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పరిగి నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రెండు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు, 9 గంటలకు రెండు ప్రత్యేక బస్సులు నడిపిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఆస్తి కోసం దాడి.. తండ్రి మృతి

పరిగి, ఫిబ్రవరి 25 : ఆస్తి కోసం కన్న తండ్రిని కొడుకు హత్య చేశాడు. ఈ ఘటన పరిగి మండల పరిధిలోని రావులపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెం దిన అబ్దుల్ రహీంకు ఇద్దరు భార్యలు. చి న్న భార్య కుమారుడు పీర్ మహ్మద్ రావులపల్లి శివారులోని హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థరెడ్డి ఫాంహౌస్‌లో పని చేస్తాడు. ఈ నెల 24న రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తండ్రి అబ్దుల్ రహీంను కుమారుడు పీర్ మహ్మద్ ఫాంహౌస్‌లో కట్టెతో కొట్టాడు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన నల్లోల్ల నర్సింహులు వారిని విడిపించి రహీంను ఇంటికి పంపాడు. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పడుకున్న చోటే ఏమీ మాట్లాడకుండా గుర్రుగుర్రు మంటు న్న అబ్దుల్ రహీంను ఆయన కుమారుడు మహమూద్‌పాషా, కుటుంబసభ్యులు ఆటోలో పరిగి దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఉస్మానియా ఆసుపత్రి కి తీసుకువెళ్లాలని సూచించారు. రహీంను హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలిస్తుండగా పరిగి శివారులోనే చనిపోయాడు. తండ్రి భూమిలో నుంచి తనకు రావాల్సిన వాటా భూమి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతోనే పీర్‌మహ్మద్ తన తండ్రిని కొట్టాడని, కొడుకు కొట్టడంతోనే రహీం చ నిపోయాడని, రహీం చావుకు కారణమైన పీర్ మహ్మద్‌పై చర్యలు తీసుకోవాలని చెల్లె లు కరీమాబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చే స్తున్నట్లు ఎస్సై సంతోశ్‌కుమార్ తెలిపారు. తండ్రిని హత్య చేసిన పీర్ మహ్మద్‌ను పరి గి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్‌నాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 25: ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరుగుతాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందు కోసం 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 7,914 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 6,418 మంది, వృత్తి విద్యలో 1,496 మందిఉన్నారని తెలిపారు. రెండో సంవత్సరంలో 6,963 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 5,589 మంది, వృత్తి విద్యలో 1,374 మంది ఉన్నారని తెలిపారు. రెండో సంవత్సరంలో ప్రైవేట్ విద్యార్థులు 1,562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

సందర్శించి.. సమీక్షించి..

దవాఖానను సందర్శించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య అదనపు సంచాలకులు పుష్ప బృందం

వికారాబాద్, ఫిబ్రవరి 25 : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ పుష్ప బృందం మంగళవారం వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించింది. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులు, ఉపవైద్యాధికారులతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వైద్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రిజిస్టర్ అయిన ప్రైవేట్ దవాఖానపై సమీక్షించారు. వికారాబాద్ పట్టణంలోని ఈషా హాస్పిటల్, అనంత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడిక్యూర్ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబిష్మెంట్ చట్టం నిబంధనల ప్రకారం దవాఖానల్లో రోగులకు, వారి అటెండెంట్లకు ఉండాల్సిన కనీస సౌకర్యాలపై అవగాహన కల్పించారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం, ఫైర్ సేఫ్టీ విధానం, దవాఖానలో అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలు, అందించే సేవల వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో వివిధ సేవలకు వసూలు చేసే రుసుం వివరాలు, అందుబాటులో ఉన్న పడకలు, అత్యవసర సేవలకు ఉన్న పడకలు, ఆక్సిజన్ సౌకర్యం ఉన్న పడకలకు సంబంధించిన వివరాలు సేకరించారు. ల్యాబ్, అంబులెన్స్ సౌకర్యం, బ్లడ్ బ్యాంకు, శిక్షణ పొందిన సిబ్బంది తదితర అంశాలను పరిశీలించి దవాఖానల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఉపవైద్యాధికారి జీవరాజ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, రాష్ట్ర స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలును పర్యవేక్షించే సిబ్బంది సునీల్ రాజ్, అనిల్, నిరంజన్ రావు, వెంకట్ రామ్ రెడ్డి , రమావాణి పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారాలు చేస్తున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సర్వీ రెస్టారెంట్, బ్లింక్ కామర్స్ ప్రై.లి, సుభాష్‌నగర్‌లోని ఎన్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్, దోమలగూడలోని భాయ్ కీ చాయ్, జవహర్‌నగర్‌లోని సహారా బేకర్స్‌లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- మండల అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 25 : పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణ, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరమ్మత్తులు, ఉపాధి హామీ పథకం అమలు, వసతి గృహాల తనిఖీ, ధరణి తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు పోలీస్ స్టేషన్లను గుర్తించామన్నారు.

మొబైల్స్‌కు అనుమతి లేదు..

పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని కలెక్టర్ అధికారులకు సూచించారు. 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. అలాగే ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండేలా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులను నడిపించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఒక ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని కలెక్టర్ తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా.. విధులు నిర్వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పహాణి స్కానింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

పహాణి స్కానింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో 2000-2015 సంవత్సరం మధ్యలో ఉన్న ప్రతి పహాణిని గ్రామాల వారీగా స్కాన్ చేయాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరం మేరకు బోర్లు, మోటర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో ఏవైనా ఇబ్బందులుంటే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించాలన్నారు. వసతి గృహాలకు ఒకే విధమైన కలర్ వేయించాలని సూచించారు.

నాణ్యతతో చేపట్టాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. భవనాల్లో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు, పారిశుధ్య పనులపై కలెక్టర్ ఆరా తీశారు. సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి ఎం.శంకర్ నాయక్, డీఈవో రేణుకాదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు

హత్యలా.. ఆత్మహత్యలా?

గ్రామస్తులు, కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ

బషీరాబాద్, ఫిబ్రవరి 25 : భార్య, భర్తల ఆర్థిక గొడవ ఇద్దరి ప్రాణాలు తీసింది. భర్త ఇంట్లోకి డబ్బులు ఇవ్వడం లేదని మూడు రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు తెలిపింది. ఆ మరుసటి రోజే అత్త, భర్త ఇంట్లో దూలాలకు ఉరేసుకుని విగత జీవులుగా కనిపించారు. ఇవి హత్యలా, ఆత్మహత్యలా అని కుటుంబీకులు, గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటన బషీరాబాద్‌లో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎల్లమ్మ (55), మొగులప్ప (35) తల్లి కొడుకులు మొగులప్ప గ్రామ పంచాయతీలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. 10 రోజుల క్రితం రెండు నెలల జీతం వచ్చిందని, ఇదే విషయమై భార్య రేణుక భర్త మొగులప్పతో గొడవ పడింది. వారం రోజులుగా ఇంట్లో గొడవ పడుతూనే ఉంది. ఈ నెల 22న స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భర్త ఇంట్లోకి డబ్బులు ఇవ్వడం లేదని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మందలించాలని కోరింది. ఆదివారం సాయంత్రం ఇదే విషయమై భార్య, భర్తలు గొడవ పడ్డారు. సోమవారం రాత్రి మొగులప్ప, తల్లి ఎల్లమ్మ, కొడుకు నందకిషోర్ ఒక గదిలో పడుకున్నారు. రేణుక, కూతురు వెన్నెల మరో గదిలో నిద్రించారు. తెల్లారి చూసేసరికి మొగులప్ప, ఎల్లమ్మ దూలాలకు ఉరేసుకుని కనిపించారు. సమాచారం అందుకున్న ఎస్సై శంకర్, ఏఎస్సై నారాయణ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ట్రాక్టర్‌లో వేసే క్రమంలో మొగులప్ప మర్మాంగాల వద్ద రక్తపు మరకలు కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబీకులు ఒక్కసారిగా అగ్రహం వ్యక్తం చేస్తూ ఇవి ఆత్మహత్యలు కావు, హత్యలేనని మృతదేహాల తరలింపును అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయాన్ని ఎస్సై ఉన్నతాధికారులకు తెలియజేయడంతో తాండూరు రూరల్ సీఐ నగేశ్ గ్రామానికి చేరుకుని ట్రాక్టర్‌లో వేసిన మృతదేహాలను క్షుణంగా పరిశీలించారు. ఉరేసుకున్న గదిలోకి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కుటుంబీకులతో, గ్రామస్తులతో మాట్లాడుతూ.. మీరు సహకరిస్తే న్యాయం జరుగుతుంది. మీకు అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పారు. పోస్టుమార్టం చేస్తేనే హత్యలా... ఆత్మహత్యల తేలుతుందన్నారు. దీంతో గ్రామస్తులు, కటుంబీకులు శాంతించి మృతదేహాలను తరలించేందుకు అంగీకరించారు. మొగులప్ప మృతితో సోదరి నర్సమ్మ పలు అనుమానాలు వ్యక్తం చేసింది. ఆత్మహత్యలైతే మర్మాంగాల వద్ద రక్తగాయాలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఇవి హత్యలేనని ఆమె ఆరోపించారు. నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. మృతుడి భార్యకు అక్రమ సంబంధం ఉందని, ఆమె హత్య చేయించి ఉటుందని గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో తల్లి, కొడుకు మృతి

మొగులప్ప (ఫైల్)

ఎల్లమ్మ

కొన'సా'గుతున్న అపార్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ఒకే దేశం.. ఒకే ఐడీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ జారీ ప్రక్రియలో పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ప్రక్రియను వేగవంతంగా చేయాలని విద్యాశాఖ సూచించినప్పటికీ విద్యార్థుల పేర్ల వివరాల్లో తప్పులు ఉండటం వల్ల ప్రక్రియ ఆలస్యంగా జరుగుతుందని పాఠశాలల యాజమాన్యలు చెబుతున్నాయి. అందులోనూ ఇది పరీక్షల సమయం కావడంతో సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలకు సన్నద్ధం చేయడంపైనే సంబంధిత ఉపాధ్యాయులు కేంద్రీకృతమయ్యారు. అపార్ నమోదులో మొన్నటి వరకు ఆధార్‌నే ప్రామాణికంగా తీసుకున్నప్పటికీ ఇప్పుడు ఆధార్ లేకున్నా తల్లిదండ్రులు పాఠశాల రికార్డులో నమోదు చేసిన పేరును కూడా నమోదు చేసుకునే వీలు ఉందని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఆపార్‌లో ఆధార్ పేరు, ఆధార్‌లో పేరు సరిగా లేకపోతే స్కూల్ రిజిస్టర్ పేరును కూడా నమోదు చేసుకునేలా ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో కొందరి విద్యార్థుల వివరాలు రెండు పేర్లుగా నమోదవుతున్నాయి. అయితే ఎప్పటికైనా ఆధార్‌లోని పేరును సరి చేసుకోవాలని అధికారులు తెలిపారు.